బీఆర్‌ఎస్‌తోనే బంగారు భవిష్యత్

- ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు
- అన్ని వర్గాలకు న్యాయం చేస్తాం
- అభివృద్ధిలో దూసుకుపోతున్న 'పట్నం'
- బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



ఎల్లమ్మతండాలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న కిషన్‌రెడ్డి

మంచాల: బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో బంగారు భవిష్యత్ సాధ్యమని, అన్ని వర్గాలకు న్యాయం చేస్తామని ఆ పార్టీ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. బుధవారం మండలంలోని దాద్‌పల్లి, చీదేడ్, రంగాపూర్, ఎల్లమ్మ తండా, బోడకొండ, లోయపల్లి గ్రామాల్లో కిషన్‌రెడ్డి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి పెద్దపీట వేశామని గుర్తుచేశారు. రైతు, దళిత, బీసీబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబార్‌తో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేశామని తెలిపారు. నియోజకవర్గానికి అనేక పరిశ్రమలు తెచ్చామన్నారు. దీంతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెరిగాయని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలతో నియోజకవర్గం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు. గిరిజన తండాలను గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసి.. ప్రత్యేక హోదా కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి తీగల కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు దండెం రాంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చీరాల రమేశ్, ప్రధాన కార్యదర్శి బహదూర్, ఎంపీపీ నర్మద, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, పీఏసీఎస్ చైర్మన్ పుల్లారెడ్డి పాల్గొన్నారు.

మంచిరెడ్డిని మళ్లీ గెలిపించండి

ఇబ్రహీంపట్నం: మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని మళ్లీ గెలిపించాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు తాళ్ల మహేశ్‌గౌడ్ కోరారు. బుధవారం ఆయన ఇబ్రహీంపట్నంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారాన్ని చేపట్టినప్పటి నుంచి పేదల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించి.. అనేక పథకాలను ప్రవేశపెట్టిందని గుర్తుచేశారు. కేసీఆర్ హ్యాట్రిక్ ఖాయమని, కిషన్ రెడ్డి నాలుగోసారి ఇబ్రహీంపట్నంలో గులాబీ జెండా ఎగురవేసి రికార్డు సృష్టిస్తారని తెలిపారు. ప్రచారంలో పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



కారు గుర్తుకు ఓటేయాలని కూరగాయలు అమ్మే మహిళను అభ్యర్థిస్తున్న శీతల్‌రెడ్డి



ఇబ్రహీంపట్నంలో ప్రచారం చేస్తున్న తాళ్ల మహేశ్‌గౌడ్

జోరుగా బీఆర్‌ఎస్ ప్రచారం

తుర్కయంజాల్: తుర్కయంజాల్ మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం చేశారు. మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని నాలుగోసారి గెలపించుకుంటామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. 30వ తేదీన జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

మంచాల: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు కుకుడాల జంగారెడ్డి వారసులు బుధవారం రంగాపూర్ గ్రామంలో మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. మాజీ పీఏసీఎస్ చైర్మన్ సికిందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కుకుడాల మాధవరెడ్డి, మహిపాల్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి తదితరులున్నారు.

ఇంటింటి ప్రచారం

యాచారం: మండల పరిధిలోని నల్లవెల్లి గ్రామంలో కారు గుర్తుకు ఓటేసి మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని గెలిపించాలని కొరుతూ బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకులు యాదయ్యగౌడ్, జిల్లా రాములు, లక్ష్మీపతిగౌడ్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. మంచిరెడ్డి కిషన్‌రెడ్డి గెలిస్తే మంత్రివుతారని ప్రజలకు వివరించారు. నియోజకవర్గానికి అధిక నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తారని తెలిపారు.

అక్కా మీ ఓటు మా దాడీకే

ఇబ్రహీంపట్నం రూరల్: అక్కా మీ ఓటు కారు గుర్తుకు వేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని గెలిపించాలని ఆయన కుమార్తె శీతల్‌రెడ్డి కోరారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండలంలోని పోల్కంపల్లి గ్రామంలో స్థానిక సర్పంచ్ అండాలు, ఎంపీటీసీ చెరుకూరి మంగ రవీందర్‌లతో కలిసి శీతల్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డిని గెలిపించండి

ఇబ్రహీంపట్నం రూరల్: బీఆర్‌ఎస్ అభ్యర్థి కిషన్‌రెడ్డిని గెలిపించాలని ఆదిబట్ల మున్సిపాలిటీ కో–ఆప్షన్ సభ్యుడు పల్లె గోపాల్‌గౌడ్ కోరారు. బుధవారం ఆదిబట్ల మున్సిపాలిటీలోని కొంగరకలాన్, చింతపల్లిగూడ, రాందాస్‌పల్లి, ఆదిబట్ల వార్డుల్లో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి గోపాల్‌గౌడ్ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కనుమరుగవుతున్న వృత్తులకు ఆదుకున్నది బీఆర్‌ఎస్ సర్కారేనని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజు, పల్లె శ్రీనివాస్, కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం



మాట్లాడుతున్న రవీందర్‌రావు

హయత్‌నగర్: గంజాయి, మద్యం, సారా అక్రమ రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నామని సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్‌రావు తెలిపారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం హయత్‌నగర్ ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి సరూర్‌నగర్ క్లస్టర్ పరిధిలోని హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, సరూర్‌నగర్, కందుకూరు, ఆమనగల్లు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇప్పటివరకు రూ.6.81 కోట్ల విలువైన మద్యం, గంజాయి, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నామని, అక్రమంగా నిల్వ చేసిన రూ.32 లక్షల విలువైన బెల్లాన్ని పట్టుకున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 290 కేసులు నమోదు చేశామని, 142 మందిని అరెస్టు చేశామని వివరించారు. బెల్ట్ షాపులు, గంజాయి వాడకంపై నిఘా పెంచామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసుల నమోదు చేస్తామని తెలిపారు. అక్రమంగా మద్యం నిల్వ చేసినా, గంజాయి రవాణా చేస్తున్నట్లు ఎవరికైనా అనుమానం వస్తే టోల్ ఫ్రీ నంబర్ 18004252325కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎన్నికల సిబ్బందికి శిక్షణ



సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం: పోలింగ్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం శేరిగూడ సమీపంలోని శ్రీ ఇందు ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరు, ఆపరేట్ విధానం, మాక్ ఓటింగ్ నిర్వహణ, వీవీపాట్ స్లిప్‌లు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఓటింగ్ పూర్తైన అనంతరం ఏవీఎంల సీలింగ్‌పై అవగాహన కల్పించారు. ఎన్నికల సమయంలో ఇబ్బందులు వస్తే సంబంధిత ఉన్నతాధికారులకు, టెక్నికల్ సిబ్బందికి వెంటనే సమాచారాన్ని ఇవ్వాలని సూచించారు.

ఆహార కల్తీతో అనారోగ్యం

ప్రిన్సిపాల్ ప్రభు



సదస్సులో అధ్యాపకులు, విద్యార్థులు

ఇబ్రహీంపట్నం: ఆహార కల్తీతో అనారోగ్య సమస్యలు వస్తాయని, కల్తీని గుర్తించేందుకు వర్క్‌షాపులు ఎంతో అవసరమని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.ప్రభు అభిప్రాయపడ్డారు. డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగ కన్వీనర్లు డా. రజిత, డా. మల్లికార్జున్ ఆధ్వర్యంలో బుధవారం ఆహార కల్తీని గుర్తించేందుకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభు మాట్లాడుతూ నేడు ఆహార పదార్థాలన్నీ కల్తీమయంగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఆహారం తినడం వలన వ్యాధులకు గురవుతున్నారని తెలిపారు. విద్యార్థులు కల్తీ ఆహారంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. రసాయన శాస్త్ర విభాగం కళాశాలలో ప్రత్యేక సదస్సును నిర్వహించడం అభినందనీయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత



పట్టుకున్న మద్యంతో సీఐ, సిబ్బంది

ఆమనగల్లు: ఆమనగల్లు ఎక్సైజ్ పరిధిలోని తలకొండపల్లి మండల సమీపంలో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్ తెలిపారు. మెదక్‌పల్లి గ్రామానికి చెందిన పోచయ్య మోటర్ సైకిల్‌పై తరలిస్తున్న 58 మద్యం బాటిళ్లు, 24 బీరు సీసాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల్లో వైన్‌షాపులు, ఫంక్షన్‌హాళ్లు, పౌల్ట్రీ ఫామ్, రైస్‌మిల్లుల్లో తనిఖీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐలు యాదయ్య, స్వప్న, సిబ్బంది దశరథ్, సురేశ్‌బాబు, లోక్య, బాలస్వామి, బాబు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆచూకీ లభ్యం



కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

కడ్తాల్: మండలంలోని మైసిగండి ఆలయ సమీపంలో మంగళవారం ఉదయం గుర్తు తెలియని యువకుడు (మూగ, చెవిటి) తిరుగుతుండటంతో పెట్రోలింగ్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా, మూగ చెవిటి వాడు కావడంతో వివరాలు తెలియరాలేదు. బుధవారం స్థానిక పోలీసులు పత్రిక ప్రకటన విడుదల చేయడంతో గుర్తించిన కుటుంబసభ్యులు కడ్తాల్ పోలీస్ స్టేషన్‌కు చేరుకొని వివరాలు తెలియజేశారు. యువకుడిది నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల కేంద్రమని, యువకుడి పేరు నరేందర్ అని, గొడవపడి ఇక్కడి రావడం జరిగిందని కుటుంబ సభ్యులు పోలీసులకు వివరించారు. పూర్తి వివరాలు సేకరించిన అనంతరం యువకుడిని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ శివప్రసాద్ తెలిపారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

మంచాల: ఆరుట్లలోని శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి జాతరను ఈ నెల 27 నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆరుట్ల సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆరుట్ల గ్రామంలో జాతరకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాండాల జంగయ్యగౌడ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం.. కాంగ్రెస్‌తోనే సాధ్యం



మాడ్గుల: సభలో ప్రసంగిస్తున్న నారాయణరెడ్డి



రఘుపతిపేటలో ప్రచారం నిర్వహిస్తున్న మాధవి

- ఆశీర్వదించండి సేవకుడిలా ఉంటా
- నియోజకవర్గ అభివృద్ధికి కృషి
- హస్తం పార్టీ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి

మాడ్గుల: ప్రజా సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ కల్వకుర్తి అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని తెలిపారు. నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని భరోసా ఇచ్చారు. బుధవారం మాడ్గుల మండలంలోని నాగిళ్ల, ఫిరోజ్‌నగర్‌తో పాటు పలు తండాల్లో నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డితో కలిసి నారాయణరెడ్డి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కసిరెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ను ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. ఇంటింటికీ తిరుగుతూ ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించారు. హస్తంగుర్తుకు ఓటు వేసి ఇందిరమ్మ రాజ్యాన్ని తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ పద్మరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీటీసీలు నారమ్మ, పాండుగౌడ్, మాజీ ఎంపీపీ రాంరెడ్డి, యాచారం వెంకటేశ్వర్లు, సింగిల్ విండో డైరెక్టర్ కొప్పుల జగన్‌గౌడ్, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నియంత పాలన నుంచి విముక్తి

ఆమనగల్లు: సీఎం కేసీఆర్ నియంత పాలన నుంచి మరో పది రోజుల్లో ప్రజలకు విముక్తి కలుగుతుందని కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని ముర్తుజపల్లి గ్రామంలో బుధవారం నారాయణరెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమనగల్లు పట్టణానికి చెందిన పలువురు యువకులు కసిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ప్రచారంలో పార్టీ రాష్ట్ర నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గుర్రం కేశవులు, కృష్ణనాయక్, పూసల సత్యం, కర్నాటి శ్రీధర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, వస్పుల శ్రీశైలం, కాలె మల్లయ్య, నర్సింహ పాల్గొన్నారు.

మాధవిరెడ్డి ప్రచారం

కల్వకుర్తి మండలం రఘుపతిపేట గ్రామంలో నారాయణరెడ్డికి మద్దతుగా ఆయన సతీమణి మాధవిరెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు.

కాంగ్రెస్‌లో చేరిక

కడ్తాల్: కడ్తాల్ మండలం కొండ్రిగానిబోడ్ తండా పంచాయతీ పరిధిలోని పిల్లిగుండుతండాకు చెందిన వార్డు సభ్యుడు రాజు, మున్యానాయక్‌తో పాటు పలువురు కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ విజయానికి కృషి చేయాలని, అధికారంలోకి రాగానే సముచిత స్థానం కల్పిస్తామని కసిరెడ్డి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కేశవులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, నాయకులు బిక్కునాయక్, రమేశ్‌నాయక్, హున్యానాయక్ తదితరులు ఉన్నారు.

విజయ ఢంకా మోగిస్తా

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని ముర్తుజపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా నారాయణరెడ్డి డప్పు కొట్టి కార్యకర్తలను ఉత్సాహ పరిచారు. ఎన్నికల్లో తనను గెలిపించాలని కసిరెడ్డి అభ్యర్థించారు.

బీఆర్‌ఎస్ పోవాలే.. కాంగ్రెస్ రావాలే

మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: బీఆర్‌ఎస్ అరాచక పాలన పోవాలని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఆ పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండలంలోని ఉప్పరిగూడ, పోచారం, మెటిల్లా గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ధరణి పోర్టల్ తెచ్చి సామాన్యులను కలెక్టరేట్ కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని మండిపడ్డారు. దళితులకు ఇస్తామన్న మూడెకరాల భూమి నేటికి ఇవ్వలేదని విమర్శించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని మూడు పర్యాయాలుగా అభివృద్ధి చేస్తామని చెప్పిన.. స్థానిక ప్రజాప్రతినిధి దోచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరాచక పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. చేయి గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వీరేశ్, మడుపు వెంకటేశ్, గోవర్ధన్‌రెడ్డి , ప్రభాకర్‌రెడ్డి, తాళ్లపల్లి వెంకటేశ్, చిన్నా , శ్రీశైలం పాల్గొన్నారు.

హస్తం ప్రజల నేస్తం

ఇబ్రహీంపట్నం రూరల్: హస్తం పేదల నేస్తమని ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి కోడలు స్నేహారెడ్డి పేర్కొన్నారు. రంగారెడ్డిని గెలిపించాలని కోరుతూ బుధవారం ఇబ్రహీంపట్నం మండలంలోని తులేకలాన్ గ్రామంలో ఆమె ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ హస్తం గుర్తుకు ఓటు వేసి రంగారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పరిగూడలో ప్రచారం చేస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

కాంగ్రెస్‌లో చేరిక

యాచారం: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రజలకు భరోసా కలుగుతుందని ఆ పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మండల పరిధిలోని నల్లవెల్లి గ్రామ ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మీపతిగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం వివిధ పార్టీలకు చెందిన పలువురు రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ప్రకటించారు. ఈ పథకాలతో అందరికీ న్యాయం జరుగుతుందని చెప్పారు.

పోలీస్ సిబ్బంది ఓటింగ్ పూర్తి

- 1214 ఓట్లకు గాను పోలైన ఓట్లు 982
- మొదటిరోజు 364, రెండోరోజు 618
- మూడు ఫెసిలిటేషన్ సెంటర్ల ఏర్పాటు



ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న సిబ్బంది

ఇబ్రహీంపట్నం: పోలీస్‌శాఖలో విధులు నిర్వర్తించే ఓటర్లు మంగళ, బుధవారం తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ పద్ధతి ద్వారా వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో 1,214 మంది ఓటర్లు పోలీస్‌శాఖలో వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్నారు. ఇబ్రహీంపట్నంలోని మండల పరిషత్ కార్యాలయంలో మూడు ఫెసిలిటేషన్ సెంటర్స్‌ను ఏర్పాటు చేయడంతో వారు ఓటు వేశారు. మొదటి రోజు 364 మంది, రెండో రోజు 618 మంది ఓటుహక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డి తెలిపారు. 232 మంది ఓటింగ్‌కు గైర్హాజరయ్యారు. కాగా, ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓటర్లకు డబ్బులను ఎరగా చూపడం గమనార్హం.

ఓటింగ్‌లో పాల్గొన్న ఓపీఓలు

శేరిగూడలోని శ్రీ ఇందు కళాశాల వద్ద ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఎన్నికల సిబ్బంది(ఓపీఓలు) తమ ఓటు హక్కును బుధవారం వినియోగించుకున్నారు. నియోజకవర్గ పరిధిలోని 859 ఓటర్లలో 219 మంది, ఇతర నియోజకవర్గానికి చెందిన 59 మంది ఈ ఓటింగ్‌లో పాల్గొన్నట్లు రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డి తెలిపారు. ఓటు వేయని సిబ్బంది 25, 26 తేదీల్లో ఓటు వేసే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

రంగనాయకమ్మ విగ్రహావిష్కరణ

కడ్తాల్: మండల కేంద్రంలోని పార్కులో లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ బాలాజీనగర్, లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు సంయుక్త ఆధ్వర్యంలో జంబుల రంగనాయకమ్మ పార్కులో బుధవారం రంగనాయకమ్మ విగ్రహాన్ని లయన్స్ క్లబ్ ఇంటర్నేషల్ డైరెక్టర్ బాబురావు క్లబ్ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రంగనాయకమ్మ అందించిన సేవలను వారు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ సునీల్ కుమార్, మోహన్‌రావు, నరేందర్‌రెడ్డి, చెన్న కిషన్‌రెడ్డి, రమేశ్‌బాబు, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, గోవర్ధన్‌రెడ్డి, కృష్ణమూర్తి, గంప శ్రీను, లింగయ్య, రాజేందర్‌రెడ్డి, వెంకటేశ్, రాంరెడ్డి, ఓంకారం, మధుసూధన్‌రెడ్డి, అంజయ్య, రమేశ్, పాషా ఉన్నారు.



రంగనాయకమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించిన లయన్స్ క్లబ్ సభ్యులు

వైద్య శిబిరం విజయవంతం



పరీక్షలు చేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో బుధవారం ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో 42 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 23 మందిని కంటి ఆపరేషన్ల నిమిత్తం ఎనుగొండలోని రాంరెడ్డి లయన్స్‌కంటి ఆస్పత్రికి పంపించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ పీఆర్‌ఓ పాషా, కోశాధికారి వెంకటయ్య, సంయుక్త కార్యదర్శి బాలకృష్ణ, సభ్యులు రామ్మోహన్, మల్లేశ్ పాల్గొన్నారు.

25న రేవంత్‌రెడ్డి రోడ్ షో

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డికి మద్దతుగా ఈనెల 25న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రోడ్ షో కార్యక్రమాన్ని ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. 25న సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు రోడ్డు షో తుర్కయంజాల్ మీదుగా ఇబ్రహీంపట్నం వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చింది.